**ఆకాశవాణి హైదరాబాద్ విభాగం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 29.06.2025** **సమయం : 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. మన దేశానికి ప్రజాస్వామ్యమే ఆయువుపట్టు అని, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ప్రజలు ఎన్నటికి సహించరని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు.

2. మహిళల నేతృత్వంలో అభివృద్ధి మంత్రం భారతదేశానికి కొత్త భవిష్యత్తును సృష్టిస్తోందని, మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

3. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ మధ్యాహ్నం నిజామాబాద్ లో జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

4. హైదరాబాద్ లో ఆషాడమాసం తొలి ఆదివారం సందర్భంగా గోల్కోండ కోట బోనాల సందడి వైభవంగా కొనసాగుతోంది.

....................................................

**మన్ కీ బాత్**

మన దేశానికి ప్రజాస్వామ్యమే ఆయువుపట్టు అని, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ప్రజలు ఎన్నటికి సహించరని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈరోజు ఆకాశవాణి మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడుతూ... దేశంలో అత్యవసర పరిస్థితి విధించి, 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా - 'సంవిధాన్ హత్యా దివస్' జరుపుకుంటున్నామని పేర్కొన్నారు.

1975 నాటి అత్యవసర పరిస్థితి కాలంలో రాజ్యాంగాన్ని ధిక్కరించి న్యాయ వ్యవస్థను తమ ఆధీనంలో ఉంచుకోవాలని ప్రయత్నించారని, కానీ ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం కావడంతో అప్పటి పాలకులు తలవంచక తప్పలేదని ఆయన గుర్తు చేశారు. చివరకు ప్రజాస్వామ్యమే విజయం సాధించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

బైట్ ... ఎమర్జెన్సీ

మహిళల నేతృత్వంలో అభివృద్ధి మంత్రం దేశానికి కొత్త భవిష్యత్తును సృష్టిస్తోందని, మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ప్రధానమంత్రి అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలోని భద్రాద్రీ కొత్తగూడెం జిల్లా స్వయం సహాయక బృందాలు సాధించిన విజయాల గురించి తన ప్రసంగంలో ఆయన ప్రస్తావించారు. పొలాల్లో రైతు కూలీలుగా పనిచేస్తూ అక్కడి మహిళా బృందాలు చిరుధాన్యాలు- శ్రీఅన్న- నుండి బిస్కెట్లు తయారు చేస్తున్నారని, వాటిని హైదరాబాద్ నుండి లండన్ వరకు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరుతో ఎగుమతి చేయడం హర్షించదగిన విషయమని ప్రధానమంత్రి అన్నారు. అలాగే ఈ మహిళలు 40 వేల 'గిరి శానిటరీ ప్యాడ్లు' తయారు చేసి, పాఠశాలలు, సమీపంలోని కార్యాలయాలకు తక్కువ ధరకే పంపిణీ చేస్తున్నారని ఇది ఎంతో అభినందనీయమని ప్రధానమంత్రి అన్నారు.

బైట్ ... నరేంద్రమోదీ

ఈ సందర్భంగా ప్రధానమంత్రి తన మన్ కీ బాత్ లో భద్రాద్రీ కొత్తగూడెం జిల్లా మహిళలు చేసిన భద్రాద్రీ మిల్లెట్ మ్యాజిక్, గిరి సానిటరీ ఫ్యాడ్స్ గొప్ప కార్యక్రమాన్ని ప్రసంశించడంపై జిల్లాలోని స్వయం సహాయక సభ్యురాలు వెంకటలక్ష్మీ తన సంతోషాన్ని ఆకాశవాణితో పంచుకున్నారు.

బైట్ .. తెలంగాణ, భద్రాద్రీ మహిళలు

దేశంలో అత్యధిక శాతం ప్రజలు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఏదో ఒక సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాన్ని పొందుతున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు ఆకాశవాణి మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడుతూ... దాదాపు 95 కోట్ల మంది ప్రజలు ఈ

సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాన్ని పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తన నివేదికలో ప్రస్తావించిందని ప్రధానమంత్రి వెల్లడించారు. ఆరోగ్యం నుంచి సామాజిక భద్రత వరకు ప్రతి రంగంలోను దేశం సంతృప్తికరమైన భావనతో పురోగమిస్తోందని ఆయన విశ్లేషించారు.

బైట్ ... స్కీమ్స్

ఇటీవల జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల గురించి పేర్కొంటూ... ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం సముద్ర తీరంలో మూడు లక్షల మందితో కలిసి యోగా చేసి, అరుదైన రికార్డును సృష్టించడం ఎంతో అద్భుతమైన విషయమని ప్రధానమంత్రి అన్నారు. 'యోగా ఫర్ వన్ హెల్త్' అనే నినాదంతో వసుదైక కుటుంబకం అనే భావనతో యోగా దినోత్సవాన్ని నిర్వహించుకోవటం అనిర్వచనీయమైన అనుభూతిని కలిగించిందని, యోగాను ఎక్కువ మంది అభ్యాసం చేయటానికి ఇది స్ఫూర్తి మంత్రంగా నిలుస్తుందని ప్రధానమంత్రి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అదే విధంగా తెలంగాణలో మూడు వేల మంది దివ్యాంగులు సమష్టిగా యోగా శిబిరంలో పాల్గొనడం చైతన్యదాయకమని అన్నారు.

బైట్ ... యోగా

డాక్టర్లను, చార్టడ్ అకౌంటెంట్లలు సమాజంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారని, వాళ్ళు మన జీవితాలను ఎంతో మెరుగు పరుస్తారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. జులై 1న డాక్టర్లు, ఛార్టడ్ అకౌంటెంట్ల జాతీయ దినోత్సవాలు జరుపుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ... వైద్యులు మన ఆరోగ్య రక్షకులని, అలాగే చార్టర్డ్ అకౌంటెంట్ - ఆర్థిక జీవితానికి మార్గదర్శకులని ప్రధానమంత్రి కొనియాడారు.

**ఎం కెబి. రియాక్షస్**

**ప్రధానమంత్రి మన్ కీ బాత్ ప్రసంగం పై పలువురి స్పందన ....**

**బైట్స్**

**అనౌన్స్మెంట్**

ప్రధానమంత్రి మన్ కీ బాత్ ప్రసంగానికి తెలుగు అనువాదాన్ని ఆకాశవాణి ఈ రాత్రి 8 గంటలకు పున:ప్రసారం చేస్తుంది.

**హోం మినిస్టర్:**

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ మధ్యాహ్నం నిజామాబాద్ లో జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ రోజు సాయంత్రం నిజామాబాద్ లోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగే రైతు మహా సభలో ఆయన ప్రసంగించనున్నారు. అలాగే, కంటేశ్వర్ ప్రాంతంలో మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. కేంద్ర హోం మంత్రి హైదరాబాద్ లోని బేగంపేట్ విమానాశ్రాయానికి చేరుకుని అక్కడి నుంచి మరి కొద్ది సేపటిలో చాపర్ లో నిజామాబాద్ బయలుదేరి వెళతారు.

పిటిసి

**బోనాలు:**

హైదరాబాద్ లో బోనాల సందడి ఆషాడమాసం తొలి ఆదివారం పురస్కరించుకుని వైభవంగా కొనసాగుతోంది. గోల్కొండ కోట అమ్మవారి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో బోనాలు సమర్పించారు. అలాగే హైదరాబాద్ మహంకాళి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ఇంద్రకీలాద్రి పై కొలువైన దుర్గమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. మేళతాళాలు, కోలాటాలు, నృత్యాలు వంటి కళా రూపాలతో భారీ ఊరేగింపుతో ఈ బోనాల వేడుకకు తెలంగాణ నుంచి పలువురు భక్తులు తరలివచ్చారు.

డెస్క్